క్లుప్తంగా

హామీల అమలు జగన్‌తోనే సాధ్యం



జగ్గంపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట శ్రీనిధి

జగ్గంపేట: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే సత్తా సీఎం జగన్‌కు మాత్రమే ఉందని, ఆయన చేయగలిగిన హామీలనే మేనిఫెస్టోలో పెట్టారని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం కోడలు శ్రీనిధి అన్నారు. జగ్గంపేటలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి పద్మనాభనగర్, టవర్ కాలనీ, రావులమ్మ తల్లి గుడి ఏరియా తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. పేదల కోసం పని చేసే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజా, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు గఫూర్, తులా రాము, కరుటూరి వీర్రాజు, కె.పైడియ్య, చిట్టిమాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మగ్గం వర్క్‌పై శిక్షణ



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వైద్యుడు విజయ్‌బాబు

ఏలేశ్వరం: మహిళలు స్వశక్తితో ఎదగాలని పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు విజయ్‌బాబు సూచించారు. వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సుమారు 120 మందికి గురువారం మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విజయ్‌బాబు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మగ్గం వర్క్ ఉపయోగపడుతుందన్నారు. మహిళలు చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం మహిళలకు శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రైతు సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



గోపాలపట్నంలో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

తొండంగి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు వాహనాల తనిఖీలను విస్తృతం చేశారు. మండలంలోని గోపాలపట్నంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కార్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు తదితర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే జాతీయ రహదారి, బీచ్ రోడ్డు, తొండంగి ప్రధాన రహదారి, రావికంపాడు రహదారి ప్రాంతాల్లో అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు.

లైఫజ్ కంపెనీలో అగ్నిప్రమాదం

తొండంగి: మండలంలోని ఏవీ నగరంలో సమీపంలో ఉన్న లైఫజ్ కంపెనీలో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. పోలీసులు, కంపెనీ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం... కంపెనీ నిర్మాణ పనుల్లో భాగంగా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌కు వెల్డింగ్ చేస్తుండగా నిరుపయోగంగా ఉన్న స్క్రాప్‌పై నిప్పురవ్వలు పడి మంటలు వ్యాపించాయి. వెంటనే అగ్నిప్రమాక సిబ్బంది మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పిందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. పెద్ద ఎత్తున దట్టమైన పొగరావడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ఆస్తినష్టం జరగలేదని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

నేడు మంత్రి రాజా ఎన్నికల ప్రచారం

తొండంగి: మండలంలోని వేమవరం, అద్దరిపేట గ్రామాల్లో శుక్రవారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు గురువారం తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు మంత్రి రాజా ఇంటింటా ప్రచారం చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి గ్రామ సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో గురువారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు.

కష్టమని పింఛన్

- పెన్షన్ల కోసం వృద్ధుల ఇక్కట్లు
- బ్యాంకుల వద్ద మండుటెండలో పడిగాపులు

ప్రత్తిపాడు రూరల్: ప్రతిపక్షాల పుణ్యామా అని పింఛనుదారులకు పాత రోజులు మళ్లీ వచ్చాయి. టీడీపీకి మేలు చేయడమే లక్ష్యంగా ఆ పార్టీ సానుభూతిపరుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్నికల కమిషన్ వలంటీర్ల సేవలను అర్ధాంతరంగా నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చింది. దీంతో గత రెండు నెలలుగా వలంటీర్ల ద్వారా జరిగే పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. మండల వ్యాప్తంగా 38,580 మంది పింఛనుదారులు ఉన్నారు. వారిలో 29,974 మందికి డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాలో పింఛన్ల సొమ్ము జమచేశారు. మిగిలిన 8,566 మందికి సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. బ్యాంకు ఖాతాలో జమ అయిన సొమ్ములను డ్రా చేసుకొనేందుకు పింఛనుదారులు బ్యాంకు వద్ద పడిగాపులు కాయవలసిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఎండ తీవ్రతను తట్టుకోలేక వృద్ధులు, వికలాంగులు పడరానిపాట్లు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోని పాత రోజులను మళ్లీ చంద్రబాబే తీసుకువచ్చారని పింఛనుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్ కష్టాలు..

రౌతులపూడి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ వలంటీర్లు పింఛన్ల పంపిణీకి దూరం కావడంతో పింఛనుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈ నెల పింఛన్లను ప్రభుత్వం నేరుగా లబ్ధిదారులు బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. కాగా పింఛను సొమ్ములను విత్ డ్రా చేసుకునేందుకు లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ బ్యాంకుల వద్ద పడిగాపులు కాసారు. ఎండ వేడిమిని తట్టుకోలేక వృద్ధులు అష్టకష్టాలు పడ్డారు. అధికారులు బ్యాంకుల వద్ద టెంట్లు వేసి తాగునీటి సదుపాయం కల్పించినా ఫలితం లేదు.



ధర్మవరం యూనియన్ బ్యాంకు వద్ద పింఛన్ల నగదు తీసుకుంటున్న లబ్ధిదారులు

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కట్టండి

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

గండేపల్లి: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మళ్లీ పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం పిలుపునిచ్చారు. మండలంలోని మురారి, గండేపల్లి, రామయ్యపాలెం, సింగరమ్మపాలెం, ఎన్టీ రాజాపురం, కె.గోపాలపురం తదితర గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, జగ్గంపేట ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గండేపల్లి మండలంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట నరసింహం

వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం



లింగంపర్తిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- లింగంపర్తిలో ఎన్నికల ప్రచారం

ఏలేశ్వరం: ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని లింగంపర్తిలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌కే మళ్లీ పట్టం కట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ప్రజలను మభ్యపెట్టేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం ఉండదన్నారు. సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఏకపక్షంగా సీట్లు రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వరుపుల సూరిబాబు, అడపా పార్థసారథి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

మర్రివీడులో వరుపుల రాజబాబు ప్రచారం

ఏలేశ్వరం: సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు తనయుడు రాజబాబు పిలుపునిచ్చారు. మండలంలోని మర్రివీడు, కంబాలపాలెం గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్‌కు మళ్లీ పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బదిరెడ్డి గోవిందు, కాలారి సత్తిబాబు, కొండపల్లి వెంకటేశ్వరరావు, లోగిసు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కంబాలపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల రాజబాబు

వైఎస్సార్ సీపీకి పట్టం కట్టండి

రౌతులపూడి: వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు కోడలు వరుపుల వీణ పిలుపునిచ్చారు. మండలంలోని గిడజాంలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా వరుపుల సుబ్బారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బండారు భైరాగి, సుంకర రామచంద్రరావు, బండారు నాగు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఓటేస్తే పథకాలు కట్

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా
- తునిలో ఎన్నికల ప్రచారం

తుని: చంద్రబాబుకు ఓటేస్తే సంక్షేమ పథకాలు ఉండవని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వైఎస్సార్ సీపీని గెలిపించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కోరారు. తుని పట్టణంలోని కంకిపాటి వారి గరువు, అమ్మాజీపేట, సీతారాంపురం, కొండవారిపేటలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అశేష జనవాహిని తరలిరావడంతో ఎన్నికల ప్రచారం జాతరను తలపించింది. రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రావాలని పార్టీ అభిమానులు, ప్రజలు నినాదాలు చేశారు. జగన్ వెంట జనం ఉన్నారని, ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని అభిమానులు ముక్తకంఠంతో చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ చంద్రబాబు చెప్పే మాయ మాటలను నమ్మితే ప్రజలు మోసపోతారన్నారు. పేదలకు సంక్షేమ పథకాలను నేరుగా అందజేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. గత ఐదేళ్లలో తుని పట్టణాన్ని అన్నిరంగాల్లోనూ అభివృద్ధి చేశామన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చాక పెండింగ్ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఎన్నికల కురుక్షేత్రంలో వైఎస్సార్ సీపీ వెంట ప్రజలు ఉన్నారన్నారు. రాష్ట్రం, తుని నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనించాలంటే రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేయాలని కోరారు. కార్యక్రమంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, పోతల రమణ, జాన్ ఆనంద్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



తునిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించండి

తుని రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు మద్దతుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని రోడ్లు, భవనాలశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్ పిలుపునిచ్చారు. తుని మండలం ఎస్.అన్నవరం ఎస్సీపేటలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్, తుని ఎమ్మెల్యేగా దాడిశెట్టి రాజాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, నాయకులు కుసనం దొరబాబు, వంగలపూడి వాసు తదితరులు పాల్గొన్నారు.



ఎస్.అన్నవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి రాజా తనయుడు శంకర్ మల్లిక్

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



ఎస్.అన్నవరంలో పార్టీలో చేరిన నాయకులతో మంత్రి దాడిశెట్టి రాజా

తుని: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా తెలిపారు. తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం తుని మండలం టి.తిమ్మాపురం, హెచ్.కొత్తూరు గ్రామాలకు చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరికి మంత్రి రాజా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తిమ్మాపురానికి చెందిన గంపల సింహాచలం, చిన్ని ఆధ్వర్యంలోనూ, హెచ్.కొత్తూరులో సర్పంచ్ కటారి సుబ్బారావు ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు.వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని మంత్రి రాజా వీరికి సూచించారు.

రేపటి నుంచి పోస్టల్ బ్యాలెట్ పంపిణీ

తుని: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు ఉన్న పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్లను శనివారం నుంచి ఈ నెల 6వ తేదీ వరకూ పంపణీ చేయనున్నట్టు తుని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేవీ రామలక్ష్మి గురువారం తెలిపారు. ఫారం 12/12డిలో దరఖాస్తు చేసుకున్న సిబ్బంది తుని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటీస్ సెంటర్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ పొందవచ్చన్నారు. శనివారం పీవోలు, ఏపీవోలు, 5, 6 తేదీల్లో ఓపీవోలు, ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసులు, అత్యవసర సేవల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగవైకల్యం, 85 ఏళ్లు పైబడి ఓటరుగా నమోదు చేసుకున్న వారికి 4, 5 తేదీల్లో ప్రత్యేక బృందాలతో హోం ఓటింగ్ సదుపాయం కల్పించామని చెప్పారు. నియోజకవర్గంలో అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఆర్వో రామలక్ష్మి కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కోటనందూరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతులు, విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో డీఈఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. మండలంలోని అల్లిపూడి, కేఏ మల్లవరం, కేఓ అగ్రహారం గ్రామాలతో పాటు కోటనందూరు, కాకరాపల్లి గ్రామాల్లో వ్యవసాయబోర్లకు ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

తొండంగి మండలంలో...

తొండంగి: మండలంలోని గోపాలపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు తెలిపారు. అన్నవరం, గోపాలపట్నం తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

దళితులకు అండగా సీఎం జగన్

ప్రత్తిపాడు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు కొండంత అండగా నిలిచారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గుడాల రామకృష్ణ అన్నారు. మండలంలోని పోతులూరు, వాకపల్లి గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం పర్యటించారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా వరుపుల సుబ్బారావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొండు రాంబాబు, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, పార్టీ నాయకులు పినిశెట్టి ప్రకాష్, ఏనుగుపల్లి శేఖర్, శెట్టి సత్తిబాబు, శెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో...

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రత్తిపాడులో గురువారం ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరారు. ఎమ్మెల్యేగా వరుపుల సుబ్బారావును, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించుకోవడం ద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని అభ్యర్థించారు. ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, పార్టీ నాయకులు మేడిబోయిన చంద్రశేఖర్, పినిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పోలింగ్ పటిష్టంగా నిర్వహించాలి

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పటిష్టంగా నిర్వహించాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏమైనా అనుమానులుంటే తక్షణమే నివృత్తి చేసుకోవాలన్నారు. మాక్ పోలింగ్ నుంచి స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలు భద్రపరచే వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలింగ్‌ను సెక్టార్ అధికారులు సైతం పర్యవేక్షణ చేయాలన్నారు. పోలింగ్ ప్రక్రియ పైనా, ప్రిసైడింగ్ అధికారుల విధులపైనా సెక్టార్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికలు) టి.శ్రీనివాసరావుతో పాటు 190 మంది ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

జగ్గంపేట: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నివాస్ తెలిపారు. జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం నియోజకవర్గ ఎన్నికల సిబ్బందికి ఏర్పాటు చేసిన రెండో విడత శిక్షణ తరగతులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల ల్యాబ్ ద్వారా సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. పోలింగ్‌పై సిబ్బందికి సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జగ్గంపేట ఆర్ఓ ఎం.శ్రీనివాసరావు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో శిక్షణా తరగతులను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్